## క్లుప్తంగా

### ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఆధార్ నమోదు చేయించుకుంటున్న గిరిజనులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ సచివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. ఆమె శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగలోని గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధార్ నమోదు కేంద్రంలో చిన్న పిల్లలు ఆధార్, నమోదు, బయోమెట్రిక్ అప్‌డేట్, చిరునామా, సెల్‌ఫోన్ నంబర్ల మార్పులు చేస్తున్నట్లు తెలిపారు.

### త్వరలో సంత వేలం



సంత స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో ప్రతి శుక్రవారం నిర్వహించే సంతకు త్వరలో వేలంపాట నిర్వహిస్తామని డీఎల్‌పీఓ రవీంద్ర బాబు తెలిపారు. శుక్రవారం ఆయన బుచ్చినాయుడుకండ్రిగలోని సంతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుచ్చినాయుడు పంచాయతీకి ఆదాయం సమకూర్చడం కోసం సంతకు వేలం పాట నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని, ప్రతి గ్రామ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు.

### బాల్యంలో పుస్తెల భారం వద్దు



పీవీపురంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బంది

సత్యవేడు: బాల్యంలో ఆడపిల్లకు పుస్తెల భారం వద్దని అంగన్‌వాడీ సూపర్ వైజర్ చెంచులక్ష్మి అన్నారు. బాల్యవివాహాల నిర్మూలనపై పీవీపురం జెడ్పీ ఉన్నతపాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్లలను చదివించాలని సూచించారు. గృహహింస చట్టంపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలపై విద్యార్థిను అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణవేణి, దీనాకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణ, సుధ తదితరులు పాల్గొన్నారు.

### బీపీ అగ్రహారంలో కుక్కల బెడద



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

శ్రీకాళహస్తి: పట్టణంలోని బీపీ అగ్రహారంలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయంలో సుమారు 10 కుక్కలు ప్రజలను, వాహనచోదకులకు కరుస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఇక పట్టణంలో పలు ప్రాంతాల్లో కూడా కుక్కల బెడద అధికంగా ఉంది. దీంతో చిన్నారులు, వృద్ధులు గాయాల పాలవుతున్నారు. పురపాలక సంఘం అధికారులు సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### పొంచి ఉన్న ప్రమాదం



చేతికి అందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గోవిందప్పనాయుడు కండ్రిగలోని జయచంద్రనాయుడు ఇంటి సమీపంలో ఏర్పాటు చేసిన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. దీంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ స్తంభానికి నాలుగు అడుగుల ఎత్తులో అమర్చి ఉన్నారు. తక్కువ ఎత్తులో ఉండడంతో గ్రామస్తులకు ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలే ప్రమాదం ఉంది. పలుమార్లు ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఏమీ.. పాలుపోవడం లేదు..!

అంతా పాడిని నమ్ముకుని బతుకుతున్న రైతులు. పదిహేను రోజులకోసారి చేతికి డబ్బులు వస్తే అందులో కొంత అవసరాలకు వినియోగించుకుని, మిగిలిన మొత్తం పాడి పశువుల దాణా, ఇతర అవసరాలకు ఖర్చు పెడతారు. ఇప్పుడు వరదయ్యపాళెం పాలశీతలీకరణ కేంద్రం మూసివేతకు రంగం సిద్ధం కావడంతో ఏమి చేయాలో పాలుపోక.. ఆందోళన చెందుతున్నారు.

- మూసివేత దిశగా వరదయ్యపాళెం పాల శీతలీకరణ కేంద్రం
- నిర్వహణ అధికమవుతుందని.. మూసివేతకు ప్రభుత్వ నిర్ణయం
- ప్రైవేటు డెయిరీలతో కుమ్మక్కయ్యారంటూ ఆరోపణలు
- ఆందోళన చెందుతున్న 400 మంది పాడి రైతులు



వరదయ్యపాళెం పాల శీతలీకరణ కేంద్రం



కేంద్రంలోని మిషన్లు

వరదయ్యపాళెం: మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో ఏర్పాటు చేసిన పాల శీతలీకరణ కేంద్రం మూత వేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఆ దిశగా తెర వెనుక కార్యాచరణ సిద్ధం చేసింది. అధికారులు ప్రైవేటు డెయిరీలతో కుమ్మక్కై పాల సేకరణ రోజురోజుకు తగ్గించేశారు. ఇప్పుడు పాల సేకరణ తగ్గిపోయిందని, పాల శీతలీకరణ కేంద్రం నిర్వహణ భారం అధికమవుతుందని చెబుతూ మూసివేసే దిశగా అడుగులు వేస్తున్నారు. దీన్ని నమ్ముకున్న 400 మంది పాడి మహిళా రైతులు ఆందోళన చెందుతున్నారు.

**2008లో ఏర్పాటు**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 2008 జనవరి 30వ తేదీన అప్పటి జిల్లా మంత్రి చెంగారెడ్డి, స్థానిక ఎమ్మెల్సీ నారాయణస్వామి చేతుల మీదుగా మండల కేంద్రమైన వరదయ్యపాళెంలో పాల శీతలీకరణ కేంద్రం ఏర్పాటైంది. అప్పటి నుంచి ఈ కేంద్రం పాడి రైతులకు అండగా నిలిచింది. గతంలో రోజూ 3వేల లీటర్ల వరకు పాల సేకరణ జరిగేది. ప్రస్తుతం 1200 లీటర్ల నుంచి 2వేల లీటర్ల వరకు సేకరణ జరుగుతుంది. మండలంలోని 29 పంచాయతీల నుంచి దాదాపుగా 400 మంది మహిళా పాడి రైతులు ఉత్పత్తిదారులుగా ఉన్నారు.

**మరమ్మతుల పేరుతో సాకులు**

అత్యంత గోప్యంగా వరదయ్యపాళెంలోని పాల శీతలీకరణ కేంద్రం మూసి వేతకు అధికారులు అడుగులు వేస్తున్నారు. గత గురువారం నుంచి కళత్తూరు, సీఎల్ఎస్‌పల్లె, కారిపాకం, తొండంబట్టు ప్రాంతాల నుంచి పాల సేకరణ నిలిపివేస్తున్నట్లు పాడి రైతులకు సమాచారమిచ్చారు. కొందరికైతే వరదయ్యపాళెం మండల కేంద్రానికి పాలను మీరే పంపితే అక్కడ నుంచి మేము బీఎన్‌కండ్రిగ పాల శీతలీకరణ కేంద్రానికి పంపుతామని సూచించారు. ఇందుకు మీ సొంత ఖర్చులతో ఆటోలను ఏర్పాటు చేసుకోవాలని తేల్చి చెప్పేశారు. దీంతో ఒక్కసారిగా రైతులు అర్థం కాని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పాల శీతలీకరణ కేంద్రం పర్యవేక్షణాధికారులను వివరణ కోరగా కేవలం వరదయ్యపాళెం పాల శీతలీకరణ కేంద్రాన్ని మరమ్మతులు చేసే వరకు కొద్ది రోజులు మాత్రం బీఎన్‌కండ్రిగ పాల కేంద్రంలో సేవలను కొనసాగిస్తామని చెబుతున్నారు. మిషన్లు పాడైపోయాయని, విద్యుత్ సౌకర్యం కూడా అంతంత మాత్రమే ఉందని తెలిపారు.

**పాల సేకరణ వద్దన్నారు**



నేను పదేళ్లుగా కళత్తూరు పంచాయతీలో పాలమిత్రగా పనిచేస్తున్నాను. మా గ్రామ పరిధిలో సీజన్‌కు అనుగుణంగా 100 నుంచి 200 లీటర్ల పాల సేకరణ జరుగుతుంది. 50 మందికి పైగా పాల ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే రెండు రోజుల ముందు పాలు పంపవద్దని పాల శీతలీకరణ కేంద్రం సూపర్‌వైజర్ మాకు చెప్పారు. పాల శీతలీకరణ కేంద్రాన్ని మూసి వేతకు ప్రభుత్వం సిద్ధం కావడం బాధాకరం.

–గురవయ్య, పాలమిత్ర, కళత్తూరు

**మూసి వేస్తే ఆందోళన తప్పదు**



వరదయ్యపాళెం ప్రభుత్వ పాల శీతలీకరణ కేంద్రాన్ని ప్రోత్సహించడం పోయి మూసివేతకు అడుగులు వేయడం సరైన నిర్ణయం కాదు. అదే జరిగితే ఈ కేంద్రానికి సభ్యులుగా ఉన్న పాడి మహిళా రైతులతో పెద్దఎత్తున ఆందోళన చేస్తాం. వరదయ్యపాళెంలోని పాల శీతలీకరణ కేంద్రాన్ని కొనసాగించే విధంగా చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

–చిన్నిరాజ్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, వరదయ్యపాళెం

**మరమ్మతులున్న మాట వాస్తవమే**



వరదయ్యపాళెం పాల శీతలీకరణ కేంద్రంలో విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం, పాల నిల్వకు ఉపయోగించే కూలింగ్ మిషన్లు తరచూ రిపేర్లకు గురవుతున్నాయి. దీని కారణంగా కొద్దిరోజులు బీఎన్‌కండ్రిగ పాల శీతలీకరణ కేంద్రంకు పాల తరలింపు కోసం అక్కడ నిర్వహణ చేపట్టే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. పూర్తిస్థాయిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్ణయం ఉంటుంది.

–సీతారాం, ఏపీఎం, వరదయ్యపాళెం

### సరుకులు సక్రమంగా పంపిణీ చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని చౌకదుకాణాల డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ చంద్రబాబునాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని బుచ్చినాయుడుకండ్రిగ, గాజులపెళ్లూరు గ్రామాల్లో ఎండీయూ వాహనాల్లో సరుకుల పంపిణీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌకదుకాణాల్లో సరుకుల పంపిణీ గురించి గ్రామాల్లో దండోరా వేయించాలన్నారు. సకాలంలో డీడీలను కట్టాలని, ఎండీయూ ఆపరేటర్లు సరుకులను కార్డుదారులందరికీ సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులను అమ్మాలన్నారు. కార్డులోని ప్రతి ఒక్కరికీ ఐదు కిలోల బియ్యాన్ని కార్డుదారులందరికీ అందించాలన్నారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ: ప్రజలు వ్యక్తిగత శుభ్రతతోపాటు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె కంచనపుత్తూరులో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని వీధుల్లోని డ్రైనేజీ కాలువల్లో పూడికతీత పనులు చేయించారు. అలాగే తాగునీటి ఓవరుహెడ్ ట్యాంకును శుభ్రం చేసి, క్లోరినేషన్ చేశారు. గ్రామంలో పారిశుధ్యంపై ర్యాలీ నిర్వహించారు. వర్షాకాలం మొదలవుతుండడంతో దోమలు వృద్ధి చెందకుండా చూసుకోవాలని, తాగునీటి కాసి వడపోసి తాగాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

## కుష్టువ్యాధి నివారణపై అవగాహన



కుష్టువ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

శ్రీకాళహస్తి రూరల్: ఎంపేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని వాగివేడు గ్రామంలో జాతీయ కుష్టు నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కుష్టు, క్షయ వ్యాధి నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసుల రెడ్డి, ఎంపెడు పీహెచ్‌సీ వైద్యాధికారి సుధీర్ కుమార్ తదితరులు కుష్టు వ్యాధి గుర్తింపు సర్వేలో భాగంగా వాగివేడులో ఇంటింటా సర్వే చేశారు. అనంతరం రోగులకు కుష్టు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి పక్షం రోజుల పాటు కుష్టువ్యాధి గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుష్టు వ్యాధి లక్షణాలుంటే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి వైద్యులను సంప్రదించాలని కోరారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, పొడలుగా మారిన నొప్పితో కూడిన నరాలు, బొడిపెలు నొప్పిలేని పుండ్లు, చెవి తమ్మెలు మందంగా మారి ఉండడం ముఖంపై నూనె రాసినట్లు జిడ్డుగా నిగనిగలాడే చర్మం ఉండడం తదితర లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధిగా భావించి, పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. డీఎల్‌ఓ, డాక్టర్ రమణ, ఫిజియోథెరపిస్టు కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పనులు అర్ధాంతరంగా ఆపకండి



అర్ధనారీశ్వరాలయం వద్ద శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని అర్ధనారీశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులను అర్ధాంతరంగా ఆపవద్దని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన అర్ధనారీశ్వరాలయం వద్ద పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్ధనారీశ్వరాలయ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి, మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేలా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చొరవ చూపాలన్నారు. గత పాలకమండలిలో రూ.1.80 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అలాగే ఏడుగంగమ్మల ఆలయంలో ఆధునీకీకరణ పనులు చేపట్టామన్నారు. మహాశివరాత్రి లోపు అర్ధనారీశ్వరాలయ ఆధునీకరణ పనులను శరవేగంగా జరిగేలా చూసి మహాకుంభాభిషేకం చేయడానికి ఎమ్మెల్యే చొరవ చూపాలన్నారు.

## ప్రైవేట్ ల్యాబ్‌ల్లో ఆకస్మిక తనిఖీలు





శ్రీకాళహస్తి: రికార్డులు పరిశీలిస్తున్న వైద్యులు, రేణిగుంటలో ల్యాబ్‌లను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

శ్రీకాళహస్తి: పట్టణంలోని పలు ప్రైవేటు క్లినికల్ ల్యాబ్‌లను వైద్యులు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశాల మేరకు పట్టణ ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు బాలు, శైలజ తనిఖీలు చేపట్టారు. రోగుల నుంచి అధిక ధరలు వసూలు చేసినా, అనవసరంగా పరీక్షలు చేసినా, లేని వ్యాధులు ఉన్నట్లు చూపి ప్రజలను భయభ్రాంతులకు గురి చేసినా చర్యలు తప్పవని ల్యాబ్ యజమానులను హెచ్చరించారు. అలాగే పట్టణంలోని శ్రీరామనగర్‌కాలనీ ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

**అనధికార ల్యాబ్‌లకు నోటీసులు**

నారాయణవనం: మండలంలో అనధికారికంగా ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న రెండు ల్యాబ్‌లకు నోటీసులను అందజేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్ దర్శిత్ రాజ్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం నారాయణవనంలోని గ్రామ చావడి వద్ద కొత్తగా ఏర్పాటైన ఆర్‌ఆర్ ల్యాబ్, పాలమంగళంలోని స్మైల్ డయగ్నస్టిక్ కేంద్రంపై దాడులు జరిపామన్నారు. అప్పటికే ల్యాబ్‌లను సిబ్బంది మూసి పరారైయ్యారని తెలిపారు. దీంతో నోటీసులను అతికించామన్నారు. దర్శిత్ రాజ్ మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఎలాంటి నైపుణ్యంలేని వారితో నడుస్తున్న ల్యాబ్‌లను ప్రజలు ఆశ్రయించవచ్చని హెచ్చరించారు. మూసివేసిన ల్యాబ్‌లను నోటీసులను అతికించి, నివేదికను జిల్లా అధికారులకు పంపామన్నారు. పాలమంగళంలో అనధికారికంగా నడుస్తున్న ల్యాబ్‌కు నోటీసులు అతికించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రైవేటు ల్యాబ్‌ల తనిఖీ**

రేణిగుంట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి ఆదేశాలతో మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి తన సిబ్బందితో కలిసి రేణిగుంటలో ఉన్న ప్రైవేట్ ల్యాబ్ లను పరిశీలించారు. అనుమతులు లేని రోగనిర్ధాణ చేసే ల్యాబ్‌లను గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. మొత్తం తొమ్మిది ల్యాబ్‌లలో ఎలాంటి అనుమతులు లేని ఎనిమిది ల్యాబ్‌లను గుర్తించినట్లు తెలిపారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డాక్టర్ ఛత్రప్రకాష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్లు నాగరాజు, కామరాజు, శోభ,పద్మ, ఏఎన్ఎంలు లోహిత, విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




నారాయణవనంలోని ఆర్ఆర్ ల్యాబ్




పాలమంగళంలోని స్మైల్ ల్యాబ్

### మహాభారత యజ్ఞం ప్రారంభం

నారాయణవనం: మండల కేంద్రమైన నారాయణవనంలోని ధర్మరాజుల ఆలయంలో మహాభారత యజ్ఞం ఉత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను 11 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త దేశప్పరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆలయంలో శాస్త్రోక్తంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. నవగ్రహ, వాస్తు శాంతి పూజలను నిర్వహించి, వస్త్రాన్ని ఆలయంలోని ధ్వజస్తంభంపైకి అధిరోహింపజేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజు సాయంత్రం పరిసర గ్రామాల్లో సత్యభామ సమేత శ్రీకృష్ణుడు, పాండవుల ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు దేశప్పరెడ్డి తెలిపారు. ఈ నెల 6వ తేదీన సాయంత్రం అశ్వవాహన సేవ, 7వ తేదీ సాయంత్రం ఒడయార్ ఉత్సవం, 8వ తేదీ సాయంత్రం సర్వభూపాల వాహన సేవ, 9న ఉదయం అర్జున తపస్సు, సాయంత్రం ఉత్తరగోకర్ణ ఉత్సవం, 10న ఉదయం అలుగు ఉత్సవం, రాత్రి గరుడసేవ, 11న ఆదివారం భక్తుల అగ్నిగుండ ప్రవేశం, రాత్రి సింహ వాహన సేవలు నిర్వహిస్తా మని తెలిపారు. ఈనెల 12వ తేదీ రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

**మహాభారత ఉత్సవాలకు అంకురార్పణ**

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామివారి ఆలయంలో మహాభారత ఉత్సవాలకు శుక్రవారం అంకురార్పణ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమం చేనేత సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ పూజారి పూజలు చేసి, అంకురార్పణ చేశారు.

### ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి ఆహ్వానం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డిని వారి స్వగ్రామంలో కలిశారు. పట్టణంలో ఈ నెల 19న జరిగే ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవానికి హాజరు కావాలని కోరారు.

### వేడుకగా వసంతోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామికి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా శుక్రవారం వసంతోత్సవం వైభవంగా నిర్వహించారు. ముక్కంటి ఆలయ వద్ద ఉన్న వసంత మండపం వద్దకు స్వామి అమ్మవార్లను వేంచేపు చేశారు. శ్రీవల్లి, దేవసేన సమేత కుమారస్వామి వారికి చందన, క్షీర, పెరుగు, పసుపు, కుంకుమ, నారికేళ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్వామిఅమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ధ్వజావరోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

### 24గంటలు వైద్యసేవలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల వైద్య సేవలు అందించాలని ఏఐవైఎఫ్ నియోజకవర్గ నాయకులు మురళి, నాగార్జున శుక్రవారం ఆస్పత్రి వైద్యాధికారి లావణ్యకు వినతిపత్రం అందజేశారు. పేద ప్రజలకు అందాల్సిన వైద్యంపై వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఇటీవల రాత్రివేళల్లో అత్యవసర చికిత్స కోసం వచ్చే పేదలపై నిర్లక్ష్యం చూపడం ఆస్పత్రి లోపల వైద్య సిబ్బంది ఉన్నప్పటికీ తలుపులు తెరవక నిర్లక్ష్యం చూపుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో నాడు–నేడు పథకం ద్వారా రూ. 2 కోట్లతో అత్యాధునిక వసతులతో భవనం నిర్మించినప్పటికీ అక్కడ వైద్యసేవలు నామమాత్రంగా ఉన్నాయని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి పర్యవేక్షణ చేపట్టి వైద్యసేవలను గాడిలో పెట్టాలని కోరారు.

## ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



ఆర్ఎంపీ క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ శ్రీలత

రేణిగుంట: ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని వైద్యాధికారి శ్రీలక్ష్మి ఆదేశించారు. మండలం కరకంబాడిలో వైద్యాధికారి డాక్టర్ రెడ్డివారి శ్రీలక్ష్మి శుక్రవారం ఆర్ఎంపీలు, పీఎంపీ క్లినిక్‌లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీలు, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఇంజెక్షన్లు, సెలైన్లు, ల్యాబ్ పరీక్షలు వంటివి చేయకూడని, అలాగే క్లినిక్‌ల్లో మెడికల్ షాపు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు కూడా ప్రభుత్వాస్పత్రిలో వైద్యం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ శివకుమార్, రోజా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు

# ముర్రుపాలతోనే మురిపాలు







బుచ్చినాయుడు కండ్రిగ: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ శిల్ప, నాగలాపురం: మాట్లాడుతున్న శ్రీదేవి, శ్రీకాళహస్తిరూరల్: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తిరూరల్: ముర్రుపాలతోనే మురిపాలు చిందుతాయని సీడీపీఓ శాంతిదుర్గ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం కమ్మ కొత్తూరు, కాపు గున్నేరి గ్రామాల్లో శుక్రవారం సీడీపీఓ శాంతి దుర్గ, ఎంఈఓ భువనేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాలపూ అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతం చేశారు. అనంతరం తల్లిపాల వారోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. సూపర్‌వైజర్ రేవతి, ఏఈ చందన, కార్యదర్శి శ్రీనివాసులు, బాబు, చిరంజీవి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

**తల్లి పాలే బిడ్డకు శ్రేష్టం**

నాగలాపురం: పుట్టిన పిల్లలకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమని పిచ్చాటూరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్నారు. మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్స వాలు నిర్వహించారు. అంగన్ వాడీ కార్యకర్త సావిత్రి, ఏఎన్ఎం భార్గవి, సీఆర్పీ శివయ్య పాల్గొన్నారు.

**అమ్మ పాలు అమృతం**

నారాయణవనం: చంటి పిల్లలకు తల్లి పాలు అమృతం లాంటివని ఆరోగ్య సిబ్బంది పేర్కొన్నారు. తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని సముదాయం ప్రాథమి పాఠశాల అనుబంధ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పౌష్టిక ఆహార పదార్థాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం పరిమళ, మహిళా పోలీసు హిందుమతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో ర్యాలీలు**

ఏర్పేడు: మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా జరిగాయి. గుడిమల్లం, సీతారాంపేట, మడిబాక తదితర అంగన్‌వాడీ కేంద్రాలలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు చేశారు. తల్లిపాల వారోత్సవాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, విజయ, గీతాంజలి, సుజాత, లక్ష్మీ, శిరీషా, ఎంఎల్‌హెచ్‌పీ షబీనా, ఏఎన్ఎంలు కుసుమ, కవిత పాల్గొన్నారు.

**బిడ్డకు రోగనిరోధక శక్తి పెంపు**

బుచ్చినాయుడుకండ్రిగ: బిడ్డకు ముర్రుపాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందని, బిడ్డకు తల్లి పాలే శ్రేష్టమని, తల్లులు తప్పని సరిగా బిడ్డలకు పాలు తాగించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిల్ప తెలిపారు. శుక్రవారం మండలంలోని పల్లమాలలో జరిగిన తల్లిపాలు వారోత్సవాల భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

**బిడ్డకు విధిగా పాలివ్వాలి**

రేణిగుంట: తల్లి పాలతో బిడ్డకు వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి తెలిపారు. తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని వెదళ్లచెరువు అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమావతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లీ తన బిడ్డకు విధిగా పాలు ఇవ్వాలని తెలిపారు. ప్రగతి సిబ్బంది సురేష్, ఆశా వర్కర్ కుమారి, అంగన్‌వాడీ వర్కర్లు గంగమ్మ, పార్వతి, ఎంపీపీ స్కూల్ టీచర్ చంద్రవర్ధిని పాల్గొన్నారు.









నారాయణవనం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిబ్బంది, ఏర్పేడు: గుడిమల్లంలో అంగన్‌వాడీల ర్యాలీ, రేణిగుంట: పౌష్టికాహార ప్రదర్శన, ఏర్పేడు: మడిబాకలో సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త విజయ